
సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 514.40 అడుగుల వద్ద ఉంది. ఇది 139.2626 టీఎంసీలకు సమానం.

మహంకాళి అమ్మవారికి విరాళం



దుగ్గిరాల: కంఠంరాజు కొండూరులోని మహంకాళి అమ్మ వారికి గుంటూరుకు చెందిన శ్రీ వసుధ డెవలపర్స్ రూ.1,00,116 విరాళం ఆదివారం అందజేసింది.

ఘనంగా అంకమ్మ తిరునాళ్ల



రొంపిచర్ల: బుచ్చి బాపన్నపాలెం గ్రామంలోని అంకమ్మ ఆలయ తిరునాళ్ల ఆదివారం ఘనంగా జరిగింది. అమ్మ వారిని ప్రత్యేకంగా అలంకరించారు. మహిళా భక్తులు పొంగళ్లు చేసి మొక్కు చెల్లించుకున్నారు.

బాస్ లేని జిల్లా ఎస్బీ!

పోలీస్ శాఖకు స్పెషల్ బ్రాంచి (ఎస్బీ) కీలకం. ముందస్తు సమాచారం చేరవేయడంలో ప్రముఖ పాత్ర పోషిస్తుంటుంది. ఆ విభాగం వారిచ్చే సమాచారంతో నేరాల నియంత్రణ చేసేందుకు అవకాశాలెక్కువ. పోలీస్ ఉన్నతాధికారులు సైతం నిఘా వ్యవస్థ అందించే సమాచారంతోనే ముందుకెళ్తారు. అటువంటి ఎస్బీ జిల్లాలో అస్తవ్యస్తంగా మారింది. గడిచిన రెండేళ్లుగా ఇదే పరిస్థితి నెలకొంది.

- గత రెండేళ్లుగా కానరాని సరైన సారథి
- వీఆర్‌లు, ఉద్యోగ విరమణ వైపు మొగ్గు
- అరకొరగానే ముందస్తు సమాచారం సేకరణ
- కీలకమైన రాజధాని జిల్లా గుంటూరులో ఇదీ పరిస్థితి



జిల్లా ఎస్పీ బంగ్లా రోడ్‌లోని జిల్లా ఎస్బీ కార్యాలయం

నగరంపాలెం: డీఎస్పీ స్థాయి పోలీస్ అధికారులు వీఆర్‌లోకి వెళ్లడం.. లేదా ఉద్యోగ విరమణ పొందడం వంటివి చోటు చేసుకుంటున్నాయి. కొందరు డీఎస్పీలపై విమర్శలు వెల్లువెత్తడంతో సీఐలకు, కింది స్థాయి ఏఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లకు దిశా నిర్దేశం చేసే వారు కనిపించడంలేదు.

కొరవడిన పర్యవేక్షణ..

జిల్లాలోని ఎస్బీ పోలీస్ శాఖకు మనిషికి ఆయువు వంటిది. అటువంటి ఎస్బీలో డీఎస్పీలు ఎక్కువ కాలం విధులు నిర్వర్తించలేకపోతున్నారు. కనీసం ఒక ఏడాదైనా ఉండటం లేదు. మూడు నుంచి ఐదారు నెలల వరకే పరిమితమవుతున్నారు. గతంలో విధుల్లో ఉన్న ఇద్దరు డీఎస్పీల పరిస్థితి అలాగే మారింది. అనధికార మామూళ్లు, సొంత సిబ్బంది నుంచే వసూళ్ల పర్వానికి పాల్పడటంతో అప్పటి ఎస్బీ సీఐ నరసింహారావును సస్పెండ్ చేశారు. డీఎస్పీ సుభాష్‌ను వీఆర్‌లోకి పంపించారు. ఆయన సుమారు ఆరు నెలలు మాత్రమే విధులు నిర్వర్తించారు. అనంతరం డీఎస్పీలుగా టీవీ రత్నస్వామి, పోతురాజు పనిచేశారు. వీరిలో ఒకరు మూడు, మరొకరు ఐదు నెలలు పని చేశారు. అంతలోనే వారిద్దరూ ఉద్యోగ విరమణ పొందారు. ఇక కొద్ది నెలలు డీఎస్పీ పోస్ట్ ఖాళీగా ఉంది. కొన్నాళ్లు సీఐలే జిల్లా అంతటా పర్యవేక్షణ చేపట్టారు.

మళ్లీ డీఎస్పీ పోస్టు ఖాళీ

కూటమి ప్రభుత్వ హయాంలో గతేడాది సెప్టెంబర్‌లో రాష్ట్ర వ్యాప్తంగా డీఎస్పీల బదిలీలు జరిగాయి. ఈ బదిలీల్లో ఎస్బీ డీఎస్పీగా బి.సీతారామయ్యను నియమించారు. ఆయన సుమారు ఎనిమిది నెలలు విధులు నిర్వర్తించారు. ఇటీవల మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ అరెస్ట్ వ్యవహారంలో తలెత్తిన పరిణామాల దృష్ట్యా డీఎస్పీ సీతారామయ్యను వీఆర్‌కు పంపించారు. ఇందులో డీఎస్పీని వీఆర్‌కు, ఒక సీఐ, ఇద్దరు ఎస్ఐలు, ఏఎస్ఐ, హెచ్‌సీ, కానిస్టేబుళ్లను సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. అప్పటుంచి డీఎస్పీ పోస్ట్‌కు ఖాళీ అయ్యింది. డీఎస్పీని నియమించాలంటే రాష్ట్ర డీజీపీ ప్రధాన కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడాల్సి ఉంది. దీంతో ఎస్బీలో ఉన్న సీఐలు మాత్రమే ఏఎస్ఐలు, హెచ్‌సీలు, కానిస్టేబుళ్లను పర్యవేక్షణ చేస్తున్నారు.

ప్రధాని పర్యటన నేపథ్యంలో..

జిల్లాలో నెలకొన్న పోలీస్‌స్టేషన్ల పరిధిలో జరిగే ర్యాలీలు, ధర్నాలు, నిరసనలు వంటి ముందస్తుగా సమాచారం సేకరించాల్సి ఉంది. ఇవన్నీ ఒక ఎత్తైతే నేరాల నియంత్రణకు సంబంధించి నిరంతర నిఘా ఉండాల్సిందే. వచ్చే నెల 2వ తేదీన ప్రధాని నరేంద్ర మోదీ రాజధాని ప్రాంతంలో పర్యటించనున్నారు. ఈ క్రమంలో వచ్చే వీవీఐపీలు, వీఐపీలు ఇతరత్రా ప్రముఖుల రాకతో మౌలిక సౌకర్యాల కల్పనపై తర్జనభర్జన పడుతున్నారు. ఐపీఎస్ అధికారులు, ఇతరత్రా బలగాలు ఉన్నప్పటికీ ఎస్బీకి సమర్థ డీఎస్పీని నియమించాల్సిన అవసరం ఉంది.

పాలకుల శీతకన్ను..

ఎస్బీ డీఎస్పీ పరిధిలో గుంటూరు పశ్చిమ, తూర్పు, దక్షిణ, ఉత్తర, తెనాలి, మంగళగిరి సబ్ డివిజన్‌లు ఉన్నాయి. జిల్లాలో రాష్ట్ర రాజధాని ఉంది. అసెంబ్లీ, హైకోర్టు కూడా ఇక్కడే కొలువు దీరాయి. సీఎం, డిప్యూటీ సీఎం, హోంమంత్రి, మంత్రులు, ఎంపీలు, రాజ్యసభ సభ్యులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలు, ఎమ్మెల్యేలు తదితరులు ఎక్కువగా ఇక్కడే ఉంటారు. ఇటువంటి తరుణంలో ఎక్కడ ఏం జరుగుతోందనే ముందస్తు సమాచారం సేకరణలో సమర్థమైన గ్రూప్–1 డీఎస్పీని నియమించాల్సిన అవసరం ఉంది. జిల్లాలోని గుంటూరు పశ్చిమ, తూర్పు సబ్ డివిజన్ డీఎస్పీ పోస్టులపై ఉన్న మక్కువ ఎస్బీ డీఎస్పీ పోస్ట్‌పై ఉన్నతాధికారులకు లేదు. దీంతో ముందస్తు సమాచారం సేకరణలో కొంత మేర అలస్యమవుతుందనే ఆరోపణలు లేకపోలేదు.

నగరపాలక సంస్థ కార్యాలయంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎన్నికల అధికారి ఎ.భార్గవ్ తేజ



మేయర్ ఎన్నిక ఏర్పాట్ల పరిశీలన

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ మేయర్ ఎన్నికకు సోమవారం జరగనున్న ప్రత్యేక సమావేశానికి సంబంధించి సమగ్ర ఏర్పాట్లు చేయాలని ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ అధికారులను ఆదేశించారు. మేయర్ ఎన్నిక జరిగే నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఏర్పాట్లను నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, కౌన్సిల్ సెక్రెటరీ బి.శ్రీనివాసరావు, డీఎస్పీ అజీజ్, లాలాపేట సీఐ శివ ప్రసాద్‌లతో కలిసి పరిశీలించారు. పలు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నిక ప్రత్యేక సమావేశానికి కౌన్సిల్ సభ్యులు, ఎక్స్ అఫీషియో సభ్యులు ఉదయం 10:30 గంటలకు తమ గుర్తింపు కార్డులతో హాజరు కావాలని తెలిపారు. సభ్యులు మినహా ఇతరులను అనుమతించబోమని తెలిపారు. మొబైల్ ఫోన్‌లకు కూడా అనుమతి లేదన్నారు. సంస్థ ప్రధాన కార్యాలయం పరిసరాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ర్యాలీలు, గుంపుగా రావడానికి వీలు లేదని చెప్పారు. తగిన చర్యలను జీఎంసీ, పోలీసు అధికారులు సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు.

ప్రధాని సభకు చకచకా ఏర్పాట్లు

తాడికొండ: మే 2వ తేదీన అమరావతి రాజధాని పునర్నిర్మాణ పనుల శంకుస్థాపన నిమిత్తం ప్రధాని నరేంద్ర మోడీ రానున్న నేపథ్యంలో ఏర్పాట్లు చకచకా కొనసాగుతున్నాయి. ఆదివారం గుంటూరు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, పలువురు ఐపీఎస్ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. పర్యటన నిమిత్తం 11 పార్కింగ్ ప్రాంతాలు, 8 రోడ్లు గుర్తించి ఆయా రహదారులలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు. సభా వేదిక నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయి. సోమవారం నుంచి ఎస్‌టీజీ కమాండోల భద్రతలోకి ఈ ప్రాంతం వెళ్లనున్నట్లు సమాచారం. హెలీప్యాడ్, సభావేదిక, వీవీఐపీల పార్కింగ్ రూట్ మ్యాప్‌లను పలువురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు కేటాయించడంతో సంబంధిత అధికారులు దగ్గరుండి మరీ పనులు కొనసాగిస్తున్నారు. ప్రధాని సభకు దాదాపు 120 ఎకరాలు కేటాయించారు. ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. 80 శాతం పనులు పూర్తి చేసినట్లు అధికారులు వెల్లడించారు.



ఏర్పాట్లు పరిశీలించేందుకు వస్తున్న అధికారులు

న్యూస్‌రీల్

గండాలయ స్వామి కొండకు పోటెత్తిన భక్తులు



మంగళగిరి: మంగళాద్రి కొండపై వేంచేసి ఉన్న గండాలయ స్వామికి మొక్కితే ఎంతటి గండాన్నైనా గటెక్కిస్తాడని భక్తుల నమ్మకం. అమావాస్య ఆదివారం పూజలు నిర్వహిస్తే భక్తుల కోర్కెలు ఇట్టే తీరుస్తాడని ప్రసిద్ధి. దీంతో ఆదివారం కొండకు భక్తులు పోటెత్తారు. ఉదయం ఐదు గంటల నుంచే కొండకు చేరుకుని స్వామిని దర్శించుకున్నారు. గండ దీపం వెలిగించారు. మంగళగిరి తాడేపల్లి చుట్టుపక్కల ప్రాంతాల నుంచే కాక విజయవాడ, గుంటూరు ప్రాంతాల నుంచి భక్తుల రాకతో కొండ కిటకిటలాడింది.

బడులు తెరిచే నాటికి పాఠ్య పుస్తకాలు సిద్ధం



గుంటూరు ఎడ్యుకేషన్: పాఠశాలలు తెరిచే నాటికి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అవసరమైన పాఠ్య పుస్తకాలు పూర్తిస్థాయిలో సిద్ధం చేస్తామని జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక తెలిపారు. అమరావతి రోడ్డులోని ప్రభుత్వ పాఠ్య పుస్తక గోదాము నుంచి ఆర్టీసీ బస్సుల్లో మండలాలకు పాఠ్య పుస్తకాలను పంపించే కార్యక్రమాన్ని ఆదివారం ఆమె ప్రారంభించారు. డీఈవో మాట్లాడుతూ ముద్రణ సంస్థల నుంచి జిల్లా కేంద్రంలోని పాఠ్య పుస్తక గోదాముకు వచ్చిన పుస్తకాలను మండలాలకు పంపుతున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా సెమిస్టర్–1లో ఉమ్మడి గుంటూరు జిల్లాకు ఇండెంట్ ప్రకారం 13.24 లక్షల పుస్తకాల్లో ఇప్పటి వరకు 7.50 లక్షల పుస్తకాలు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠ్య పుస్తక మేనేజర్ వి. వజ్రబాబు, గుంటూరు ఈస్ట్ ఎంఈవో–1 అబ్దుల్ ఖుద్దూస్, ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం, సిబ్బంది పాల్గొన్నారు.

రాహు కేతు పూజలకు భారీగా భక్తులు



పెదకాకాని: శివాలయంలో అమావాస్య ఆదివారం సందర్భంగా రాహు కేతువులకు పూజలు జరిపించేందుకు అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. పెదకాకాని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి ఆలయంలోని రాహుకేతువు పూజల్లో పాల్గొనేందుకు దూర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు వేకువ జామునే క్యూలైన్లలో బారులు తీరారు. ఉదయం నాలుగు గంటల నుంచి సాయంత్రం రాహుకాల సమయం వరకు 1,509 టికెట్లు విక్రయించినట్లు ఆలయ ఉప కమిషనర్ గోగినేని లీలా కుమార్ తెలిపారు. రాహు కేతు పూజల ద్వారా ఆదివారం రూ. 7,54,500 ఆదాయం సమకూరిందన్నారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా దేవస్థాన అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ పూజలతోపాటు అభిషేక పూజలు, అన్నప్రాసనలు, తలనీలాలు, వాహనపూజలు, అంతరాలయ దర్శనాలు, చెవిపోగులు తదితర ఇతర సేవలు ద్వారా రూ.9,10,000 ఆదాయం వచ్చినట్లు ఉప కమిషనర్ తెలిపారు.

వేసవి విజ్ఞాన తరగతులు బ్రోచర్ ఆవిష్కరణ



గుంటూరువెస్ట్: జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ వేసవి విజ్ఞాన తరగతులు బ్రోచర్‌ను ఆవిష్కరించారు. సోమవారం నుంచి జూన్ 6 వరకు 40 రోజుల పాటు వేసవి విజ్ఞాన తరగతులు నిర్వహిస్తారన్నారు. ప్రతి రోజూ ఉదయం 8 నుంచి 11 గంటల వరకు జరిగే ఈ తరగతులకు తమ పిల్లల్ని తల్లిదండ్రులు పంపాలన్నారు. ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వంకదారి సుబ్బరత్నమ్మ, ఉప గ్రంథ పాలకురాలు కె.ఝాన్సీ లక్ష్మి, లైబ్రేరియన్స్ ఎన్.నాగిరెడ్డి, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

ముప్పతిప్పల 'స్లాట్'

రిజిస్ట్రేషన్లకు సంబంధించి ప్రభుత్వం తెచ్చిన కొత్త స్లాట్ విధానంతో ప్రజలకు ముప్పుతిప్పలు తప్పడం లేదు. అటు అధికారులు కూడా తలలు పట్టుకుంటున్నారు. రోజుకు పరిమితంగా రిజిస్ట్రేషన్లు జరగడం, నిర్దేశిత సమయానికి ఇరుపార్టీల వారు కచ్చితంగా రావాల్సి ఉండటం, ఏ చిన్న తప్పు సరిచేసుకోవాలన్నా మళ్లీ చలానా కట్టాల్సి రావడం వంటి ఇబ్బందులు ఉన్నాయి.

- రిజిస్ట్రేషన్ నూతన విధానంతో కష్టాలు
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి
- రోజుకు 39 రిజిస్ట్రేషన్లు మాత్రమే సాధ్యం
- నిర్ణీత సమయానికి వెళ్లకుంటే స్లాటు రద్దే
- చిన్న తప్పున్నా చలానా పరిస్థితీ అంతే



గురజాలలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

గురజాల: గురజాలలో స్లాట్ విధానం అమలైన తొలిరోజు శనివారం ఒక దస్తావేజును బుకింగ్ చేశారు. ఆ సమయంలో సర్వే నెంబరు తప్పుగా నమోదైంది. సీఎస్ నెంబరు తీసుకుని ఇరు పార్టీల వారు వచ్చారు. ఆ సమయంలో సర్వే నెంబరు చూసుకోవడంతో కట్టిన చలానా రద్దు అయింది. మళ్లీ చలానా మరొకటి చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి వచ్చింది. అన్ని రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో నూతన విధానాన్ని శనివారం నుంచి అమలులోకి తీసుకువచ్చారు. ఈ విధానంపై ప్రజల్లో సందేహాలు వ్యక్తమవుతున్నాయి. దీని వలన సమయం ఆదా అవుతుందని, సకాలంలో రిజిస్ట్రేషన్ పూర్తి అవుతాయని ప్రభుత్వం చెబుతోంది. క్షేత్రస్థాయిలో పరిస్థితులకు పొంతన లేకుండా పోయిందనే విమర్శలు వస్తున్నాయి. సమయం ఆదా సంగతి పక్కన పెడితే ఇరు పార్టీల వారు ఒకేసారి అందుబాటులోకి రావాలి. ఏ ఒక్కరూ పది నిమిషాలు ఆలస్యం అయినా రిజిస్ట్రేషన్ జరిగే అవకాశాలు లేవు. దస్తావేజులో ఏమైనా తప్పు దొర్లినా సవరించుకునే అవకాశం కూడా లేదు. మళ్లీ చలానా చెల్లించాల్సిన పరిస్థితి. దీనిపై ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఆర్థికంగా తమపై భారం పడటం తప్ప ఒరిగిందేమీ లేదని వాపోతున్నారు.

ఎక్కువ రిజిస్ట్రేషన్లు అసాధ్యం

పల్నాడు జిల్లాలోని నరసరావుపేట, చిలకలూరిపేట, వినుకొండ, మాచర్ల, గురజాల, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, క్రోసూరు, పెదకూరపాడు, అమరావతిలలో మొత్తం పది సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. వాటి పరిధిలోని గ్రామాల్లో ఆయా రిజిస్ట్రార్ కార్యాలయాల్లో క్రయ విక్రయాలు జరుగుతుంటాయి. పాత విధానంలో ఏ సమయంలో అయినా పనులు చేసుకునేందుకు వెసులుబాటు ఉండేది. కొత్త పద్ధతి ప్రజలతోపాటు కార్యాలయ వర్గాలకు సైతం తలనొప్పిగా మారింది. కాస్త ఆలస్యమైతే స్లాటు బుకింగ్ రద్దు అవుతోంది. రోజుకు స్థానిక కార్యాలయంలో 39 రిజిస్ట్రేషన్‌లు, జిల్లా కేంద్రంలో 78 రిజిస్ట్రేషన్లు మాత్రమే జరిగేలా స్లాట్ విధానం ఉంది. దీని వలన ప్రభుత్వ ఆదాయానికి సైతం గండి పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. పాత విధానం అయితే ఎన్ని రిజిస్ట్రేషన్‌లు అయినా చేసుకునేందుకు అవకాశం ఉండేది. చలానాల రూపంలో ప్రభుత్వానికి ఆదాయం సమకూరేది. ఈ సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

తమ్ముళ్ల చెరవు..!

చెరువును చెరబట్టిన తమ్ముళ్ల స్వార్థంతో ప్రజలు అల్లాడుతున్నారు. యథేచ్ఛగా మట్టిని తవ్వి తరలిస్తుండటంతో గ్రామానికి చుక్కనీరు కూడా అందని పరిస్థితి నెలకొంది. తాడికొండ మండలం లాం గ్రామంలో అధికార పార్టీ నాయకుల అక్రమ దందా మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగుతోంది. తాగునీటి చెరువును ఎండగట్టి అక్రమ మట్టి దందాకు తెరలేపిన తెలుగు తమ్ముళ్లు... పరిమితికి మించి దాదాపు 20 అడుగుల లోతు మట్టిని తవ్వి తరలించారు.

- చెరువులో భారీగా మట్టి తవ్వకాలు
- రూ. కోట్లలో టీడీపీ నేతల అక్రమార్జన
- ఎమ్మెల్యే కార్యాలయం నుంచి పూర్తిస్థాయిలో అండదండలు
- నిలదీస్తే అక్రమ కేసులతో వేధింపులు
- నీటి ఎద్దడితో అల్లాడుతున్న ప్రజలు
- చోద్యం చూస్తున్న స్థానిక అధికారులు



చెరువులో జేసీబీతో అక్రమంగా తవ్వుతున్న దృశ్యం

తాడికొండ: తాగునీటి నిల్వకు సైతం చెరువు పనికి రాకుండా ఉండేలా మట్టిని అమ్మి రూ. కోట్లు సొమ్ము చేసుకుంటున్నారు. నిబంధనల ప్రకారం తాగునీటి చెరువు మట్టిని సిల్ట్ తొలగించాలంటే 2 నుంచి 3 అడుగులు మాత్రమే తీసి కట్టలను బలోపేతం చేయాలి, ఇక్కడ మాత్రం పంచాయతీ తీర్మానం చేసి గ్రామంలో మట్టి రోడ్లకు వినియోగం పేరిట టీడీపీ నాయకులు దందా చేస్తున్నారు. తట్టెడు మట్టి కూడా గ్రామ రోడ్లకు, స్థానిక అవసరాలకు వినియోగించలేదు. రియల్ ఎస్టేట్ దందా జోరుగా కొనసాగుతుండటంతో తవ్విన మట్టిని వెంచర్లకు తరలించి భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. ట్రాక్టర్‌కు రూ. 500, పది చక్రాల లారీకైతే రూ. 2 వేలు సీనరేజీ రూపంలో వసూలు చేసి, ప్రైవేటు బిల్లులు పెట్టి మరీ జేబులు నింపుకొంటున్నారు.

ప్రభుత్వ పెద్దల అండదండలు

పంచాయతీకి ఆదాయం సమకూరేలా సీనరేజీ నగదును రూ. కోట్లలో జమ చేయాల్సి ఉన్నప్పటికీ అరకొరగా గ్రామ పంచాయతీ ఖాతాకు పంపుతున్నారు. మిగిలిందంతా టీడీపీ నాయకులు మింగేస్తున్నారు. గత మూడు నెలలుగా తాగునీటి చెరువులో నీరు లేక ఎండగట్టడంతో గ్రామంలో చుక్క నీరు సరఫరా చేసే పరిస్థితి లేదు. ప్రజలు కొనుగోలు చేసి మరీ నీటిని వాడుకుంటున్నారు. తెలుగు తమ్ముళ్లు చెరువును 20 అడుగుల మేర తవ్వి మట్టి తరలించారంటే దందా ఏ స్థాయిలో నడుస్తుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఎమ్మెల్యే కార్యాలయం నుంచి పూర్తిగా అండదండలు ఉండటంతో షాడో ఎమ్మెల్యేను ప్రసన్నం చేసుకుని ఇలా దోచుకుంటున్నారు.

అధికారులకూ వాటాలు?

అంత బహిరంగంగా తవ్వకాలు జరుపుతున్నా, ప్రైవేటు వెంచర్లకు మట్టిని తరలిస్తున్నా మైనింగ్, పోలీసు, రెవెన్యూ అధికారులు మీనమేషాలు లెక్కిస్తుండటం చూసి వారికీ మామూళ్లు భారీగా ముట్టాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇకనైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. తాగునీటి అవసరాలు తీర్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మట్టి తరలింపు దందా చేస్తున్న వ్యక్తులపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ ధనం రికవరీ చేయాలని పలువురు కోరుతున్నారు.

నీరు కొనుక్కోవాల్సిందే



గత మూడు నెలలుగా గ్రామంలో కనీస అవసరాలకు చుక్క నీరు లేక నానా ఇబ్బందులు పడున్నాం. 20 లీటర్ల క్యాను రూ. 15 కు కొనుగోలు చేసి తాగాల్సిన దుస్థితి ఏర్పడింది. కనీస అవసరాలకైనా నీటిని సరఫరా చేస్తారనుకుంటే ట్యాంకర్లు కూడా పంపించడం లేదు. స్వార్థం కోసం కొనసాగుతున్న ఈ దందాను అధికారులు నిలిపివేయాలి.

– షేక్ సలీం

రూ.కోట్ల విలువైన మట్టి తరలింపు



గ్రామ అవసరాల పేరుతో పంచాయతీ తీర్మానం చేసినా స్థానిక ప్రజలకు మాత్రం ఒక్క ట్రాక్టర్ ట్రక్కు మట్టి ఇవ్వలేదు. రియల్ ఎస్టేట్ వెంచర్లకు ఇష్టారీతిగా అమ్ముకుని జేబులు నింపుకొన్నారు. దాదాపు రూ. 3 కోట్ల నుంచి రూ. 4 కోట్ల విలువైన మట్టి తరలి వెళ్లిపోయింది. దీనిపై తగిన చర్యలు తీసుకోవాలి.

– వై.నాగార్జునరెడ్డి

కోర్టును ఆశ్రయిస్తాం



టీడీపీ నాయకులు తమ స్వార్థం కోసం చెరువును తవ్వి నీటి నిల్వకు అవకాశం లేకుండా చేశారు. చెరువును నీటితో ఇప్పుడు నింపినా చుక్క నీరు ఉండదు. మొత్తం ఇంకిపోతుంది. నల్లమట్టి లేయర్ పూర్తయి గ్రావెల్ కూడా బయటపడింది. ఇంత భారీగా జరిగిన దందాపై అధికారులు స్పందించకపోవడం భవిష్యత్తులో నీటి సమస్యను తీవ్రం చేయనుంది. దీనిపై కోర్టును ఆశ్రయిస్తాం.

– షేక్ అయూబ్

నీటికి తీవ్ర ఇబ్బందులు



ఇప్పటి వరకు జరిగిన దందా కారణంగా గ్రామంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. దుస్తులు ఉతుక్కునేందుకు కూడా బక్కెటు నీరు దొరకడం లేదు. టీడీపీ నాయకులు జేబులు నింపుకోవడం వెనుక అధికార పార్టీ అండదండలు పూర్తిగా ఉన్నాయి. ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించాలి.

– బాబా వలి

'కపిరాజు' నాటికకు ప్రథమ బహుమతి



ఉత్తమ నటుడిగా బహుమతి అందుకుంటున్న ఆనంద్ మూర్తి పాత్రధారి గోవాడ వెంకట్

మార్టూరు : శ్రీకారం రోటరీ కళాపరిషత్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 24, 25, 26 తేదీల్లో మార్టూరులో నిర్వహించిన తెలుగు రాష్ట్రాల స్థాయి నాటిక పోటీలు శనివారంతో ముగిశాయి. ఇరవై కేటగిరీలకు గాను ఆరింటిలో బహుమతులను కైవసం చేసుకుని న్యూ స్టార్ మోడ్రన్ థియేటర్ విజయవాడ వారి 'కపిరాజు' నాటిక అగ్రస్థానంలో నిలిచింది. నాలుగు కేటగిరిల్లో బహుమతులు పొంది కళానికేతన్ వీరన్నపాలెం వారి 'రుతువులేని కాలం' నాటిక ద్వితీయ స్థానం, మూడు కేటగిరిల్లో బహుమతులు సాధించి విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్ హైదరాబాద్ వారి స్వేచ్ఛ నాటిక తృతీయ స్థానంలో నిలిచింది. కపిరాజు నాటికకు సంబంధించి ఉత్తమ ప్రదర్శన, ఉత్తమ దర్శకుడిగా ఎమ్మెస్ చౌదరి బహుమతులు అందుకున్నారు. ఉత్తమ సహాయ నటుడిగా పవన్ కల్యాణ్, ఉత్తమ మేకప్ మెన్‌గా దినేష్, పవన్ కుమార్, దిలీప్ రెండు ప్రత్యేక బహుమతులు అందుకున్నారు. కళానికేతన్ వీరన్నపాలెం వారి 'రుతువులేని కాలం' నాటికకు తృతీయ ఉత్తమ ప్రదర్శనతోపాటు ఉత్తమ రచయితగా అగస్త్య, ఉత్తమ హాస్యనటునిగా సురేంద్రబాబు, సురభి పూజిత ప్రత్యేక బహుమతులు అందుకున్నారు. విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్ హైదరాబాద్ వారి 'స్వేచ్ఛ' నాటికకు గాను ఉత్తమ నటుడిగా గోవాడ వెంకట్, మంజు భార్గవి ప్రత్యేక బహుమతితోపాటు ఉత్తమ ద్వితీయ ప్రదర్శనగా ఎంపికైంది.

బాలుర వాలీబాల్ పోటీల విజేత సత్తెనపల్లి

సత్తెనపల్లి: అండర్–17 బాలుర వాలీబాల్ పోటీల విజేతగా పీఎం శ్రీ కేవీ సత్తెనపల్లి సత్తా చాటింది. పల్నాడు జిల్లా సత్తెనపల్లి (రామకృష్ణాపురం)లోని పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయ ఆవరణలో రెండు రోజులుగా జరుగుతున్న 54వ కేవీస్ హైదరాబాద్ రీజినల్ స్థాయి అండర్–17 బాలుర వాలీబాల్ పోటీలు హోరాహోరీగా సాగి ఆదివారం ముగిశాయి. విజయవాడ–1 జట్టుపై సత్తెనపల్లి జట్టు విజేతగా నిలిచింది. వాల్తేరుపై గెలిచి ఖమ్మం జట్టు తృతీయ స్థానం కైవసం చేసుకుంది.



సత్తెనపల్లి జట్టుకు బహుమతి అందిస్తున్న దృశ్యం

క్లుప్తంగా

డీఎస్సీపై అభ్యర్థుల అభ్యంతరాలను పరిష్కరించాలి

డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న



లక్ష్మీపురం: ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీలో అభ్యర్థుల అభ్యంతరాలను పరిష్కరించాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న డిమాండ్ చేశారు. గుంటూరు బ్రాడీపేటలోని డీవైఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో ఆదివారం జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ డీఎస్సీ ప్రకటించాలని చేసిన ఆందోళన ఫలితంగా నోటిఫికేషన్ విడుదల చేయడం అభినందనీయం అన్నారు. ఏడేళ్లగా నోటిఫికేషన్ విడుదల చేయని కారణంగా వయోపరిమితిని 47 సంవత్సరాలకు పెంచాలని, పరీక్షకు సిద్ధమయ్యేందుకు కనీసం 90 రోజులు సమయం కావాలని, ఒకే జిల్లాకు ఒకే పేపర్ ఉండాలనే అభ్యర్థుల అభ్యంతరాలపై విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ స్పందించాలని కోరారు. ఎప్పుడు లేని మార్కుల పర్సంటేజ్‌ని తీసుకువచ్చారని అన్నారు. ఇప్పటి వరకు అభ్యర్థుల అభ్యంతరాలపై మాట్లాడక పోవడం చూస్తే మంత్రికి ఉన్న చిత్తశుద్ధి అర్థమవుతుందని చెప్పారు. ఇప్పటికైనా మంత్రి లోకేష్ స్పందించి వారి అభ్యంతరాలను పరిష్కరించాలని కోరారు. డీవైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ వై.కృష్ణకాంత్ మాట్లాడుతూ అభ్యర్థుల అభ్యంతరాలను వెంటనే పరిష్కరించాలని, లేకపోతే వారితో కలిసి ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా నాయకులు పి.భార్గవ్, పి.బాషా, ఎం.ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నదిలో దూకి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య



తాడేపల్లి రూరల్: కృష్ణా నది ప్రకాశం బ్యారేజ్‌పై నుంచి ఓ వ్యక్తి నదిలోకి దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై తాడేపల్లి పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ ప్రతాప్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... కృష్ణానది సీతానగరం వైపు ప్రకాశం బ్యారేజ్ 6వ ఖానా వద్ద శనివారం రాత్రి ఓ యువకుడు కృష్ణానదిలోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. అతను కృష్ణానది నీటి స్టోరేజ్ కోసం ఏర్పాటు చేసిన గేటుపై పడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకుని మృతదేహాన్ని బయటకు తీసి పరిశీలించగా అతని వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదు. మృతిచెందిన వ్యక్తి వయస్సు 30 సంవత్సరాలు లోపు ఉంటుంది. మృతుడి శరీరంపై నల్ల జీన్స్ ఫ్యాంట్, నల్లని చొక్కా ధరించి ఉన్నాడు. ఎవరైనా ఈ మృత దేహాన్ని గుర్తిస్తే 80084 43915 నంబర్‌కు ఫోన్ చేయాలని ఎస్ఐ కోరారు.

కానిస్టేబుల్‌పై హత్యాయత్నం కేసులో ముగ్గురు అరెస్ట్

పరారీలో మరో రౌడీషీటర్

తెనాలిరూరల్: పోలీస్‌స్టేషన్‌లో కౌన్సెలింగ్ ఇచ్చాడన్న కక్షతో కానిస్టేబుల్‌ను హత్య చేసేందుకు యత్నించిన ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. మరో రౌడీషీటర్ పరారీలో ఉన్నాడు. స్థానిక టూ టౌన్ సర్కిల్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో సీఐ రాములనాయక్ వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. పట్టణ వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కన్నా చిరంజీవిపై ఈ నెల 24న హత్యాయత్నం చేసిన చెంచుపేటకు చెందిన చేబ్రోలు జాన్ విక్టర్, మంగళగిరికి చెందిన షేక్ బాబూలాల్ అలియాస్ కరీ ముల్లా, అయితానగర్ కు చెందిన దోమ రాకేష్‌ను ఆదివారం అరెస్టు చేశారు. ఈ కేసులో మరో నిందితుడిగా ఉన్న రౌడీషీటర్ వేము నవీన్ అలియాస్ కిల్లర్ పరారీలో ఉన్నాడు. అయితానగర్‌లో ఉండే కానిస్టేబుల్ చిరంజీవి గతంలో త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహించాడు. జాన్ విక్టర్‌పై టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సస్పెక్ట్ షీట్ ఉంది. గంజాయి విక్రయం, దొంగతనం, కొట్లాట కేసులలో నిందితుడు. దోమ రాకేష్ కూడా చెడు వ్యసనాలకు బానిస. పలు కేసులలో నిందితుడు. కానిస్టేబుల్ చిరంజీవి గతంలో త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో పని చేసే సమయంలో గంజాయి సేవిస్తున్నారన్న కారణంగా జాన్ విక్టర్, దోమ రాకేష్‌లను పలు దఫాలు స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ నేపథ్యంలో చిరంజీవిపై కక్ష పెంచుకున్న నిందితులు, అతనిని అంతమొందించాలన్న నిర్ణయానికి వచ్చారు. అయితానగర్‌కు చెందిన రౌడీ షీటర్ వేము నవీన్ అలియాస్ కిల్లర్ సహాయం కోరారు. ఈనెల 24న జాన్ విక్టర్, దోమ రాకేష్‌ను అయితానగర్ రావాల్సిందిగా వేము నవీన్ కోరాడు. వారిరువురు కరీముల్లాను వెంటబెట్టుకొని అయితానగర్ చేరారు. నలుగురు కలిసి మద్యం తాగి, కానిస్టేబుల్ విధి నిర్వహణకు వెళ్లే సమయంలో అంతమొందించాలని నిర్ణయించుకున్నారు. అయితానగర్ అంబేడ్కర్ విగ్రహం రోడ్డులో చిరంజీవి వస్తాడన్న విషయం తెలుసుకున్న నలుగురు రాత్రి 9.30 గంటల సమయంలో అక్కడ మాటు వేశారు. బైక్‌పై వెళుతున్న చిరంజీవిని అటకాయించారు. అతనితో వాగ్వావాదానికి దిగారు. అదే సమయంలో కరి ముల్లా, రాకేష్ ఇరువురు చిరంజీవిని గట్టిగా పట్టుకోగా, రౌడీషీటర్ నవీన్ అతనిపై దాడి చేశాడు. జాన్ విక్టర్ తన వెంట తెచ్చుకున్న కత్తితో చిరంజీవిపై దాడి చేశాడు. పెనుగులాటలో వారి నుంచి తప్పించుకున్న చిరంజీవి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుల కోసం గాలిస్తుండగా, వారు లింగారావు సెంటర్‌లో ఉన్నట్లు తెలుసుకొని అదుపులోకి తీసుకున్నారు. రౌడీ షీటర్ నవీన్ పరారయ్యాడు. నిందితుడు ఉపయోగించిన కత్తిని కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను త్వరితగతిన అరెస్ట్ చేసిన సందర్భంగా ఎస్పీ అభినందించినట్లు సీఐ రాముల నాయక్ తెలిపారు. సమావేశంలో ఎస్ఐ బురాన్‌షరీఫ్, సిబ్బంది ఉన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాములనాయక్

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమావేశమైన పూర్వ విద్యార్థులు

తెనాలి అర్బన్: వారంతా వివిధ రంగాల్లో స్థిరపడిన వారు. తమ మనుమళ్లు, మనుమరాళ్లతో ఆడుకునే వారు ఒకే వేదికపై కలిసి చిన్ననాటి మధురస్మృతులను నెమరువేసుకుని సందడి చేశారు. తమ జీవితాల్లో జరిగిన కష్టసుఖాలను పాలుపచుకుని ఆనందంగా గడిపారు. దీనికి తెనాలి కొత్తపేటలోని రావి సాంబయ్య మున్సిపల్ హైస్కూల్ వేదికగా మారింది. 1974–75 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఆత్మీయ అలింగనాలు చేసుకున్నారు. ఆనాటి గురువులు పిచయ్య, రూతు, పిచ్చేశ్వరమ్మ, ప్రస్తుత ప్రధానోపాధ్యాయురాలు షేక్ మౌలాబీలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమాన్ని డాక్టర్ దానబోయిన కృష్ణసాయిబాబు, పట్టెల మల్లేశ్వరరావు, అన్నవరపు మధు, సజ్జా మధుసూదనరావు, చిన్నం హేమ చంద్రప్రసాద్, కొల్లిపర శంకర బాబు, గడ్డిపాటి కిషోర్‌లు పర్యవేక్షించారు.



ఆనాటి ఉపాధ్యాయులకు సన్మానం

మద్యం మత్తులో పరస్పర దాడులు

చీరాల: మద్యం మత్తులో ఇరువురు వ్యక్తులు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్న సంఘటన ఆదివారం చీరాలలో చోటుచేసుకుంది. శ్రీకాంత్, ప్రశాంత్ ఇద్దరు బంధువులు. ఆదివారం మద్యం తాగి ఇద్దరు ఘర్షణ పడి ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈ ఘటనలో శ్రీకాంత్‌కు గొంతులో కత్తి గుచ్చుకుంది. చీరాల ఏరియా వైద్యశాలకు తరలించి అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం గుంటూరు తరలించారు. ప్రశాంత్ చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు అవుట్ పోస్టు పోలీసులు వివరాలను నమోదు చేశారు.

గుర్తుతెలియని వ్యక్తి దారుణ హత్య

మేడికొండూరు: పేరేచర్లలో గుర్తు తెలియని వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. సేకరించిన సమాచారం మేరకు.. పేరేచర్ల విశ్వ భారతి కళాశాల సమీపంలో గుర్తు తెలియని వ్యక్తిని బండరాయితో తలపై బలంగా కొట్టి హత్య చేశారు. అటుగా వెళ్తున్న గ్రామస్తులు సమాచారం ఇవ్వడంతో మేడికొండూరు పోలీసులు సంఘటన జరిగిన ప్రదేశానికి వెళ్లి ఆధారాలు సేకరిస్తున్నారు. మృతుని వయస్సు సుమారుగా 45 – 50 సంవత్సరాలు ఉంటుందని పోలీసులు పేర్కొన్నారు. ఆచూకీ తెలిసిన వారు మేడికొండూరు పోలీసులను సంప్రదించాలని సీఐ తెలిపారు.

ట్రాక్టర్, ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి



మృతి చెందిన జకరయ్య

మేడికొండూరు: రోడ్డుపై వేగంగా వెళుతున్న ట్రాక్టర్ ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో వ్యక్తి అక్కడక్కడ దుర్మరణం చెందిన సంఘటన మండలంలోని పాలడుగు అడ్డరోడ్డు వద్ద ఆదివారం జరిగింది. గుంటూరు నల్లకుంటకుకు చెందిన తమ్మిశెట్టి జక్కరయ్య (45) తన భార్యతో కలిసి సత్తెనపల్లి నుంచి గుంటూరుకు ద్విచక్ర వాహనంపై వెళుతున్నారు. మార్గంమధ్యలో ద్విచక్ర వాహనాన్ని ట్రాక్టర్ ఢీకొనడంతో ప్రయాణిస్తున్న జక్కరయ్య మృతి చెందాడు. ఆయన భార్యకు స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పందిళ్లమ్మ గుడిలో చోరీ



వేటపాలెం: మండలంలోని పందిళ్లపల్లి శివారు పంట పొలాల్లో ఉన్న గ్రామ దేవత పందిళ్లమ్మ అమ్మవారి దేవస్థానంలో శనివారం రాత్రి చోరీ జరిగింది. దొంగలు దేవస్థానం ముందు వైపుగల కటకటాల తాళాలు పగలగొట్టి లోపలకు ప్రవేశించారు. హుండీని కూడా పగలగొట్టి అందులోని నగదు, బీరువాని తెరచి అమ్మవారి నగలు ఎత్తుకెళ్లారని ఎస్ఐ ఎం. వెంకటేశ్వర్లు ఆదివారం తెలిపారు. చోరీకి గురైన మొత్తం విలువ రూ.30 వేలు ఉంటుందని పేర్కొన్నారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

బల్లికురవ: కుంటుంబ కలహాలతో ఓ వివాహిత ఎలుకల మందు పేస్టు తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ ఘటన శనివారం అర్ధరాత్రి మండలంలోని చిన అంబడిపూడిలో జరిగింది. 108 సిబ్బంది, స్థానికుల సమాచారం మేరకు.. చిన అంబడిపూడి బీసీ కాలనీకి చెందిన పల్లపు అనూష ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఎలుకల మందు పేస్టు తిని అపస్మారక స్థితికి చేరుకుంది. కుటుంబ సభ్యులు 108 వాహనానికి సమాచారం అందించారు. సిబ్బంది ప్రాథమిక చికిత్స చేసి అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనూష ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగానే ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు.

స్కూటీని ఢీ కొట్టిన లారీ వ్యక్తి మృతి

వేటపాలెం: వేగంగా వస్తున్న లారీ ఎదురుగా వస్తున్న స్కూటీని ఢీ కొట్టిన సంఘటనలో వ్యక్తి మతి చెందాడు. 216 జాతీయ రహదారి బైపాస్ రోడ్డులో అక్కాయిపాలెం దగ్గరలో సంఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీస్ లు తెలిపిన వివరాల మేరకు... చీరాలకు చెందిన రాజు కృష్ణారెడ్డి(61) తన స్కూటీపై వేటపాలెం పని నిమిత్తం వచ్చాడు. పని ముగించుకుని రాత్రి తిరిగి బైపాస్ రోడ్డు మీదగా చీరాల బయలు దేరాడు. అక్కాయిపాలెం జంక్షన్ దగ్గరలో చీరాల వైపు నుంచి వేగంగా వచ్చిన లారీ ఢీ కొట్టింది. త్రీవ గాయాలతో ఉన్న వ్యక్తిని చీరాల ఏరియా వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ వెంకటేశ్వర్లు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు గుంటూరులో కోకో రైతుల ధర్నా

కొరిటిపాడు(గుంటూరు): అంతర్జాతీయ మార్కెట్ ప్రకారం కోకో గింజలకు ధర కల్పించాలని, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి ఇచ్చిన హామీ ప్రకారం కోకో గింజల ధరల ఒప్పందం నిర్ణయం ప్రకటించాలని కోరుతూ సోమవారం కోకో రైతులు ధర్నా నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బొల్లు రామకృష్ణ, కె.శ్రీనివాస్‌లు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం ఉదయం 10 గంటలకు గుంటూరు చుట్టుగుంటలోని ఉద్యాన శాఖ రాష్ట్ర కమిషనర్ కార్యాలయం ఎదుట జరిగే కోకో రైతుల ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్రంలో ఏలూరు, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కోనసీమ, కాకినాడ, అనకాపల్లి, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో 75 వేల ఎకరాల్లో కొబ్బరి, ఆయిల్ పామ్ అంతర పంటగా కోకోను రైతులు సాగు చేస్తున్నారని తెలిపారు. ఇప్పటి వరకు అంతర్జాతీయ మార్కెట్ ధరకు అదనంగా ధర ఇచ్చి కోకో గింజలు కొనుగోలు చేసిన కంపెనీలు నేడు సిండికేట్‌గా మారి కోకో రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ మార్కెట్‌లో కిలో కోకో గింజలకు రూ.750 పైగా ధర ఉందని, ప్రస్తుతం కంపెనీలు రూ.450 నుంచి రూ.500 వరకు మాత్రమే ధర ఇస్తున్నాయన్నారు. చిన్న, సన్నకారు రైతులు, కౌలు రైతుల నుంచి కోకో గింజలను కొనుగోలు చేయడం లేదని, ఒకవేళ కొనుగోలు చేసినా తక్కువ ధర ఇవ్వడం వల్ల నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కోకో గింజలు కొనుగోలు, ధరల సమస్యలపై ఈ నెల 3వ తేదీన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెంనాయుడు రాష్ట్ర సచివాలయంలో ఉద్యాన శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు, కోకో రైతులు, కొనుగోలు కంపెనీలతో సమావేశం నిర్వహించారని వెల్లడించారు. ఈ సమావేశం నిర్ణయం ప్రకారం ఈ నెల 7వ తేదీన కోకో గింజల ఒప్పంద నిర్ణయం ప్రకటన చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు ప్రకటించకపోవడంతో కంపెనీలు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయని, ఫలితంగా కోకో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి అంతర్జాతీయ మార్కెట్ ధర ప్రకారం కోకో గింజలకు ధర కల్పించి కోకో రైతులకు న్యాయం చేయాలని కోరారు. ధర్నా కార్యక్రమంలో కోకో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

కుమారుడు సహా తల్లి ఆత్మహత్యాయత్నం

- ప్రాణాలు కోల్పోయిన బాలుడు
- విషమంగా తల్లి పరిస్థితి

లక్ష్మీపురం: కుటుంబ కలహాలతో కుమారుడు సహా ఓ మహిళ ఆత్మహత్యాయత్నం చేసింది. ఈ ఘటనలో బాలుడు ప్రాణాలు కోల్పోయాడు. తల్లి పరిస్థితి విషమంగా ఉంది. పట్టాభిపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గుంటూరు రూరల్ మండలం తురకపాలెం గ్రామానికి చెందిన ఆదురి గణేష్ (38), కుమారి దంపతుల కుమారుడు చంద్రశేఖర్ మణికంఠ (9) ఉన్నాడు. గణేష్ గుంటూరు ఎల్‌వీఆర్ క్లబ్‌లో పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. మార్చి 30వ తేదీన గుండె పోటు కారణంగా మృతి చెందాడు. ఆ తరువాత గుంటూరులోని మారుతీనగర్‌లో గల మహాప్రస్థానంలో నిద్ర చేయడానికి కుమారి, చంద్రశేఖర్ మణికంఠలతోపాటు అత్తమామలు వెళ్లారు. భర్త మృతితో కుమారి మానసికంగా బాధపడుతోంది. ఈ నెల 24వ తేదీన కుమారుడిని అత్త మందలించడంతో ఎలుకల మందు తీసుకుని గుజ్జనగుండ్ల పార్క్‌కు కుమారి వెళ్లింది. బాలుడికి తినిపించి తానూ తిని ఆత్మహత్యాయత్నం చేసింది. తర్వాత అమరావతికి చేరుకున్నారు. అత్తమామలు పట్టాభిపురం పోలీసులను ఆశ్రయించడంతో సీఐ గంగా వెంకటేశ్వర్లు యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. అమరావతిలో ఉన్నట్లు గుర్తించారు. స్థానికులు గుంటూరు జీజీహెచ్‌కు తరలించగా, చికిత్స పొందుతూ చంద్రశేఖర్ మణికంఠ ఆదివారం మృతి చెందాడు. కుమారి పరిస్థితి విషమంగా ఉంది.

ఇగ్నో కోర్సులతో ఉద్యోగావకాశాలు పుష్కలం



మాట్లాడుతున్న ఇగ్నో ప్రాంతీయ కేంద్ర డైరెక్టర్ డాక్టర్ శరత్‌చంద్ర

గుంటూరు ఎడ్యుకేషన్: ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వ విద్యాలయం (ఇగ్నో) అందిస్తున్న కోర్సులతో పుష్కలమైన ఉగ్యోగావకాశాలు లభిస్తున్నాయని ఇగ్నో ప్రాంతీయ కేంద్ర డైరెక్టర్ డాక్టర్ పి.శరత్‌చంద్ర పేర్కొన్నారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాల ప్రాంగణంలోని ఇగ్నో అధ్యయన కేంద్రంలో ఆదివారం 2025 జనవరిలో భాగంగా ప్రవేశం పొందిన విద్యార్థులకు ఇండక్షన్ ప్రోగ్రాం నిర్వహించారు. శరత్‌చంద్ర మాట్లాడుతూ ఇగ్నో అందిస్తున్న వివిధ రకాల కోర్సుల గురించి వివరించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే ఉద్దేశంతో ఇగ్నో అందిస్తున్న మెటీరియల్ అందరికీ అందుబాటులో ఉండే విధంగా ఇగ్నో సైట్‌లో పొందుపరచి ఉంటుందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని చక్కగా చదువుకోవాలని చెప్పారు. ఇగ్నో అధ్యయన కేంద్ర సమన్వయకర్త డాక్టర్ డీవీ చంద్రశేఖర్ మాట్లాడుతూ వయసుతో సంబంధం లేకుండా చదువుకోవాలనే లక్ష్యం కలిగిన వారు ఇగ్నో ద్వారా వారి ఆశయాన్ని నెరవేర్చుకోవాలని సూచించారు. ఇగ్నో వంటి ప్రతిష్టాత్మకమైన విశ్వవిద్యాలయంలో చదవడం ద్వారా ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీ హెచ్ కామేశ్వరశాస్త్రి విద్యార్థులకు ప్రాజెక్టు వర్క్స్ గురించి దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో అధ్యయన కేంద్ర కౌన్సిలర్ డాక్టర్ ఎంఎస్ నారాయణ, సహాయ సమన్వయకర్తలు డాక్టర్ పి.దేవేంద్ర గుప్త, ఎం.మార్కండేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

2 నుంచి కొలకలూరులో ఆహ్వాన నాటికల పోటీలు

తెనాలి: రూరల్ మండల గ్రామం కొలకలూరుకు చెందిన కొలంకపురి నాటక కళాపరిషత్, శ్రీసాయి ఆర్ట్స్, కొలకలూరు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఉభయ రాష్ట్రస్థాయి 11వ ఆహ్వాన నాటికల పోటీలు మే నెల 2–4 తేదీల్లో జరగనున్నాయి. గ్రామంలోని చిన్న రథశాల వద్ద ప్రతిరోజూ రాత్రి ఏడు గంటల్నుంచి 11 గంటల వరకు పోటీలు జరుగుతాయని శ్రీసాయి ఆర్ట్స్ దర్శకుడు, రంగస్థల, సినీనటుడు గోపరాజు విజయ్ ఆదివారం తెలియజేశారు. తొలిరోజున కళాపరిషత్ గౌరవాధ్యక్షుడు వైఎస్‌కేఎస్ స్వామి, ఉపాధ్యక్షుడు సుద్దపల్లి మురళీధర్ జ్యోతిప్రజ్వలన చేస్తారు. తొలి ప్రదర్శనగా ఉషోదయ కళానికేతన్, కట్రపాడు వారి 'కిడ్నాప్' నాటికను ప్రదర్శిస్తారు. రచన, దర్శకత్వం చెరుకూరి సాంబశివరావు. తర్వాత కళానికేతన్–వీరన్నపాలెం వారి'రుతువు లేని కాలం' నాటిక వుంటుంది. అగస్త్య రచించిన నాటికకు వైటీ చౌదరి దర్శకత్వం వహిస్తారు. చివరగా గురజాడ కళామందిర్–విజయవాడ వారి 'మహాప్రస్థానం' నాటికను ప్రదర్శిస్తారు. 3వ తేదీన విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్–హైదరాబాద్ వారి 'స్వేచ్ఛ', యంగ్ థియేటర్ ఆర్గనైజేషన్, విజయవాడ వారి '27వ మైలురాయి', మైత్రి కళానిలయం–విజయవాడ వారి 'బ్రహ్మ స్వరూపం'నాటికలను ప్రదర్శిస్తారు. చివరిరోజైన 3వ తేదీన లలిత శ్రీకళాసమితి, శ్రీకాకుళం వారి 'మతమా? మానవత్వమా' నాటిక, మహతి క్రియేషన్స్, హైదరాబాద్ వారి 'ఉక్కు సంకెళ్లు' నాటికలను ప్రదర్శిస్తారు. చివరగా శ్రీసాయి ఆర్ట్స్, కొలకలూరు వారి ప్రత్యేక ప్రదర్శన 'జనరల్ బోగీలు' నాటికను ప్రదర్శిస్తారు.

కళాప్రముఖులకు అవార్డుల ప్రదానం

ఆహ్వాన నాటికల పోటీల వేదికపై ప్రముఖులకు అవార్డుల ప్రదానోత్సవం ఉంటుందని విజయ్ తెలియజేశారు. తొలిరోజున ఆకుల సాంబశివరావు అధ్యక్షతన జరిగే సభలో నటుడు, దర్శకుడు కరణం సురేష్ జ్ఞాపకార్థం 'సవ్యసాచి' అవార్డును తాడేపల్లికి చెందిన ప్రముఖ రంగస్థల నటుడు, దర్శకుడు గంగోత్రి సాయికి బహూకరిస్తారు. సంగీత దర్శకుడు తుమ్మల సాంబశివరావు స్మారకంగా బైరికి చెందిన సంగీత దర్శకుడు పి.లీలామోహనరావును సత్కరిస్తారు. ఈ సభలో ముఖ్యఅతిథిగా ప్రముఖ సినీ రచయిత డాక్టర్ సాయిమాధవ్ బుర్రా పాల్గొంటారు. 3వ తేదీన జరిగే సభలో గోపరాజు హేమలత జీవిత సాఫల్య పురస్కారాన్ని ఒంగోలుకు చెందిన రంగస్థల నటీమణి ఎం.రత్నకుమారికి ప్రదానం చేస్తారు. పిన్నమనేని మృత్యుంజయరావుకు సభకు అధ్యక్షత వహిస్తారు. 4వ తేదీన గోపరాజు బాలాత్రిపురసుందరి జీవిత సాఫల్య పురస్కారాన్ని రంగస్థల, సినీనటి సురభి ప్రభావతి బహూకరిస్తారు. పసుమర్రుకు చెందిన రూపశిల్పి పచ్చల శేషగిరిని రూపశిల్పి మదన్‌మోహన్ స్మారకంగా సత్కరిస్తారు. ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరవుతారని వివరించారు.

'గిన్నిస్'లో చినకాకాని బాలుడికి చోటు



అవార్డు అందుకుంటున్న ఇమ్మాన్యేల్



తల్లిదండ్రులతో శ్రీనాథ్

చినకాకాని(మంగళగిరి): నగర పరిధిలోని చినకాకానికి చెందిన బాలుడు గిన్నిస్ బుక్‌లో చోటు సంపాదించాడు. ప్రపంచ స్థాయిలో కీబోర్డు ద్వారా క్రిస్టియన్ సంగీతాన్ని అప్‌లోడ్ చేసే ప్రక్రియలో ఈ గుర్తింపు లభించింది. ఒక గంట సమయంలో 1,046 వీడియోలను ఇన్‌స్టాగామ్‌లో అప్లోడ్ చేసిన బృందంలో బాలుడు ఇమ్మాన్యేల్ ఉన్నాడు. ఈ మేరకు విజయవాడలో జరిగిన కార్యక్రమంలో తల్లిదండ్రులు పాస్టర్ జేజీసీ పాల్, డాక్టర్ సుజన సమక్షంలో నిర్వాహకులు బాలుడికి అవార్డు అందజేశారు. ఇమ్మాన్యేల్ ఆత్మకూరు నిర్మల స్కూలులో చదువుతున్నాడు.

రెడ్డిపాలెం విద్యార్థికి కూడా..

గుంటూరు రూరల్: రెడ్డిపాలెం గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ కుటుంబానికి చెందిన పి.లక్ష్మీనరసయ్య, సుజాతల కుమారుడు పడాల శ్రీనాథ్ స్థానిక పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. ఈ బాలుడికి కూడా సంగీత కార్యక్రమానికిగాను నిర్వాహకులు గిన్నిస్ ధ్రువపత్రం అందించారు.

ఐదో రోజుకు మహా మంజీర నాదం నృత్యాలు



బాద్‌షా షేక్ మణిపురి నృత్య ప్రదర్శన



ఒడిశా నృత్యం చేస్తున్న గోకుల్ శ్రీదాస్



భరత నాట్యం ప్రదర్శిస్తున్న డాక్టర్ శరత్‌చంద్ర

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో అన్నమయ్య కళావేదికపై 15వ అంతర్జాతీయ నృత్య దినోత్సవంలో భాగంగా మహామంజీర నాదం–2025 ఆదివారం ఐదో రోజుకి చేరాయి. శ్రీసాయి మంజీర కూచిపూడి ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో జరగ్గా, నూతలపాటి తిరుపతయ్య జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. సంస్థ అధ్యక్షుడు డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. అనంతరం బాద్‌షా షేక్(పశ్చిమ బెంగాల్) మణిపురి నృత్యాన్ని, గోకుల్ శ్రీదాస్ (భువనేశ్వర్) ఒడిశా నృత్యాన్ని, డాక్టర్ శరత్‌చంద్ర (తిరుపతి) భరతనాట్యం ప్రదర్శించారు. సభికులను నృత్యాలు అలరించాయి. ఆరవేటి ప్రభావతి, డాక్టర్ కె.దేవేంద్ర పిళ్లైలకు ప్రముఖ భరత నాట్య గురువు మరంగంటి కాంచనమాల జీవిత పురస్కారం అందించారు. కళాకారులను సంస్థ కార్యదర్శి డాక్టర్ కాజ వెంకటసుబ్రహ్మణ్యం కళాకారులను యువ కళారత్న పురస్కారాలతో సత్కరించారు. కార్యక్రమంలో తిరుపతి ఎస్వీ మ్యూజిక్ అండ్ డాన్స్ కళాశాల పూర్వ ప్రధానచార్యురాలు ఎస్.జానకిరాణి పాల్గొనగా, పఠాన్ మోహిముద్దీన్, వెంకటగిరి నాగలక్ష్మి పర్యవేక్షించారు.

దివ్యాంగ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

బాపట్ల: దివ్యాంగ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రాష్ట్ర దివ్యాంగ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు డి.ఎల్లయ్య కోరారు. స్థానిక ఎన్జీవో హోంలో ఆదివారం దివ్యాంగ ఉద్యోగుల సంఘం బాపట్ల జిల్లా అధ్యక్షులు ఏ.శివాజీగణేషన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఇందులో రాష్ట్ర అధ్యక్షుడు డి.ఎల్లయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో దివ్యాంగ ఉద్యోగులు పనులు చేసే చోట తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఫేషియల్ అటెండెన్స్, సీపీఎస్ విధానం నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. షరతులు లేకుండా ఏడు సాధారణ సెలవులను వర్తింపు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ప్రకాశం జిల్లా దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు కె.కోటేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటేశ్వరరావు, ట్రెజరర్ శివ, జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాసరావు, సీహెచ్. శ్రీనివాసరావు, మురళి, కృష్ణమోహన్, జిలాని పాల్గొన్నారు.

జనసేన కన్వీనర్ రాజేష్‌కు నోటీసు

చావలి(వేమూరు): జనసేన నియోజకవర్గ కన్వీనర్ ఊసా రాజేష్ దళిత వర్గానికి చెందిన కొండయ్యను చెప్పుతో కొట్టి పార్టీ నియమావళి ఉల్లఘించినందుకు నోటీసు జారీ చేసినట్లు పార్టీ కాన్ఫ్లిక్ట్ మేనేజ్‌మెంటు హెడ్ వేములపాటి అజయ కుమార్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. దాడిపై లిఖితపూర్వకంగా 48 గంటల్లో కేంద్ర కార్యాలయంలో సమర్పించాలని పార్టీ ఆదేశాలు జారీ చేసిందని పేర్కొన్నారు. విచారణ చేసిన తర్వాత చర్యలను పార్టీ తీసుకుంటుందని తెలిపారు. దళితలపై జన సేన పార్టీ నాయకులు, కార్యకర్తలు దాడులకు పాల్పడితే సహించేది లేదని ఆయన స్పష్టం చేశారు.